# పక్కింటి పిన్నిగారు

"ఏమండోయ్ ... మీకీ విషయం తెలుసా?" అడిగింది మా శ్రీమతి నేను యింట్లోకి అడుగుపెట్టగానే. ఏమిటన్నట్లు చూశాను.

"ఆ మేడమీది మేస్టారి ప్రవర్తన మంచిదికాదుట" అంది కాఫీ కలుపుతూ.

"ఓస్ యింతేకదా! మూడో ప్రపంచ యుద్ధం వచ్చిందన్నంత కంగారుపడ్డాను" అన్నాడు అక్కడున్న సోఫాలో కూర్చుంటూ.

"ఆ తాసీల్దారుగారి అమ్మాయిని వల్లో వేసుకుని రోజూ రూమ్‌కి రప్పించుకుంటున్నాట్ట!" కాఫీ అందిస్తూ 'కంటిన్యూ' చేసింది తన ధోరణిలో.

"ఇంతకీ నీకీ వార్త ఎవరు చెప్పారు?"

"మన పక్కింటి పిన్నిగారు"

"ఆవిడకి మొగుడు పోయినదగ్గర నుంచీ యిలాంటి విషయాలంటే తెగ మోజువస్తోంది పాపం!" అన్నాడు కాఫీ గ్లాసు టీపాయ్‌మీద ఉంచుతూ.

"వాల్లెండి. ఆమె వింటుంది" అనేసి ఖాళీ గ్లాసు అందుకుని లోపలికెళ్ళిపోయింది మా శ్రీమతి.

ఆడవాళ్ళకి ప్రేమ వ్యవహారాల గురించి వినడం అన్నా చెప్పడం అన్నా మహా సరదా కాబోలు' అనుకున్నాను. ఆ మాటకొస్తే ఎవరికి మాత్రం యిష్టం వుండదు? అసలా ప్రేమ అనే రెండక్షరాల్లో ఉంది నిజమైన, అసలు సిసలైన 'కిక్కు!'

ఆ మేడమీది మాస్టారిగా పిలవబడే మాధవరావుగారు ఆ రూమ్‌లో దిగి దాదాపు ఐదేళ్ళవుతుంది. అతను గురించి యిలా వినడం యిదే మొదటిసారి. అసలాయన రూమ్‌లో ఉన్నారో లేరో ఎవరికీ తెలిసేది కాదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే మా వీధిలో ఉన్న బహు కొద్ది మంచివారిలో ఆయనొకరు!

అలాంటి వ్యక్తి తన క్రింద వాటాలో ఉన్న తాసిల్దారుగారి అమ్మాయితో వ్యవహారం నడపడం.... అది కాస్త బజార్న పడడం.. నాకు నిజంగా బాధనిపించింది. ఇందులో అసలు నిజమెంతో తెలుసుకుందామనిపించింది.

మరో వారం రోజుల తరువాత ఓ సాయంత్రం... ఆ మేస్టారు హోటల్‌లో కన్పించారు కాఫీతాగుతూ. ఆయనపక్క సీటు ఖాళీగానే ఉంది. 'ఇంతకంటే మంచి అవకాశం రాదు' అనుకుంటూ నేను పక్క సీట్లో కూర్చున్నాను. ఆయన నన్ను చూసి పలకరింపుగా నవ్వారు.

"కాలేజీమండేనా రావడం" అడిగాను.

"ఔనండీ."

**కిల్లాన మోహన్‌బాబు**

ఈలోగా సర్వర్ రావడం నేను కాఫీ అర్డరివ్వడం జరిగాయి. సంభాషణ ఎలా మొదలెట్టాలో అర్థంకావడంలేదు నాకు.

"సిలబస్‌లు అయిపోయాయండీ!" అంటూ కదిపాను. ఇది చచ్చు ప్రశ్నేమో నని నాకే అన్పించింది.

"సిలబస్ అయినా అవకపోయినా 'పరీక్షల బస్' అగదు కదండీ" అన్నా రాయన నవ్వుతూ.

మంచి 'సెన్సాఫ్ హ్యూమర్' ఉన్న వ్యక్తి కాబట్టే ఆ అమ్మాయి పడింది మరి అనుకున్నాను.

ఈలోగా కాఫీ రావడం.... నేను తాగడం జరిగాయి.

'పదండి పోదాం' అంటూ లేచా రాయన. ఎంత వద్దంటున్నా వినకుండా యిద్దరి బిల్లూ అతనే చెల్లించాడు.

సినిమాల గురించీ, విద్యార్థుల క్రమ శిక్షణారాహిత్యం గురించీ, నేటి రాజ కీయాలగురించీ అతను అనర్గళంగా మాట్లా డారు. అన్ని విషయాల గురించి అవ గాహన ఉన్న మనిషి' అన్పించింది నాకు.

ఇంతలో అతనుండే పోర్షన్ వచ్చింది.

"మీకేం పనిలేకపోతే రండి. కాసేపు రూమ్‌లో కూర్చుని వెళ్దురుగాని" అన్నారు మేస్టారు.

"పదండి" అంటూ ఆయన వెనకాలే వెళ్లెక్కాను.

ఆయన రూమ్ చాలా బావుంది. బ్రహ్మచారి గది అయినా.... ఎంతో అందంగా అలంకరించబడి ఉంది. ఏ వస్తువు ఎక్కడ ఉండాలో అక్కడే ఉంది. టేబిల్‌మీద ఉన్న ఆపిల్స్ ముక్కలుకోసి ప్లేటులోసర్ది నా ముం దుంచారాయన.

"ఎందుకండీ యివన్నీ. ఇప్పుడేగా కాఫీ తాగాం" అన్నాడు మొహమాటంగా.

"పర్వాలేదు. తీసుకోండి. మొదటి సారిగా యిక్కడికొచ్చారు కదా. ఈలోగా నేను మొహం కడుక్కొని వస్తాను" అనేసి టవల్ అందుకుని బాత్‌రూమ్‌కి వెళ్లారు. వర్షు లేకుండా ఆయన మరీ బావున్నట్లు అనిపించింది నాకు.

రెండు ఆపిల్ ముక్కలు తిని...... అక్కడే టీపాయ్‌మీదున్న వీక్లీ తీసా న్నేను పేజీలు తిరగేస్తుండగా 'సడెన్'గా ఆ పుస్తకంలోంచి ఓ ఫోటో క్రింద పడింది. తీసి మళ్ళీ ఆ పుస్తకంలో ఆ ఫోటో ఉంచబోతుండగా నా దృష్టి అను కోకుండా ఆ ఫోటోలోని వ్యక్తిపై పడింది. మరెవరో కాదు. తాసీల్దారుగారి అమ్మాయి హిమబిందు!

నా అనుమానం బలపడింది!

ఇంతలో మేస్టారు మొహం తుడుచు కుంటూ లోనికొచ్చారు. నా చేతిలో ఆ ఫోటో చూసి కంగారుపడినట్లు కని పించారు.

"పొరి ఉదయమే ఆ అమ్మాయి వచ్చి యీ ఫోటో యిచ్చి వెళ్ళింది. కాలేజీకి టైం కావడంతో అది అక్కడే అలా ఉంచేసి వెళ్ళిపోయాను" అంటూ నా చేతి లోని ఆ ఫోటో తీసుకున్నారాయన.

ఈ అవకాశం జారవిడుచుకోవడం నా కిష్టంలేదు.

"అయితే అందరూ అనుకునేది నిజమే నన్నమాట" అన్నాను నవ్వుతూ.

చాల యిబ్బందిగా మొహం పెట్టా రాయన.

"సినిమా భాషలో చెప్పాలంటే మే మిద్దరం గాఢంగా ప్రేమించుకున్నాం. ప్రాణానికి ప్రాణంగా, ఒకరికొకరుగా, తోడునీడగా జీవితాంతం కలిసి ఉండా లనుకుంటున్నాం. మా పెద్దలు దీవిస్తే పెళ్ళిపేరుతో ఒకటవుతాం. అందుకే ఆ ఫోటో మా యింటికి పంపాలనుకుంటు న్నాను." ఆవేశం, నాటకీయత రెండూ కలగలిసిన గొంతుతో అన్నారు మాస్టారు.

"చాలా సంతోషం."

"అలా అన్నవారు మీరొక్కరే కనిపించారు. ఈ వీధిలో మిగతావారం దరూ నానా రకాలుగా అనుకుంటున్నా రట. ఇది తెలిసి 'హిమ' చాల బాధ పడ్తోంది."

"అయితే ఆలశ్యం ఎందుకు? ఆ శుభ కార్యమేదో తొందరలోనే జరిగే ఏర్పాట్లు చూడండి. అప్పుడు వాళ్ళందరి నోళ్ళకి తాళాలు వేసినట్టుంటుంది కదా."

"అందరిలాగే నాకూ కొన్ని అవరో ధాలున్నాయండి. ఇంకా మా అన్నయ్యకు పెళ్ళికాలేదు. ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. అయినా వీళ్ళ బాధపడలేక ఆ పెళ్ళేదో తొందరలోనే చేసుకుంటే బావుంటుంది అన్పిస్తూంది నాకు."

"అసలు మీ యిద్దరికీ పరిచయం...." ఆగాను.

"ఈ క్రింది వాటాలో తాసీల్దారుగారు దిగి దాదాపు ఆరు మాసాలయ్యింది. హిమబిందు బియ్యే పరీక్షకి ప్రైవేట్‌గా వెళ్తోంది. అప్పుడప్పుడూ 'ఎకనామిక్స్'లో ఏవైనా 'డౌట్స్' ఉంటే నా దగ్గరికి వచ్చి చెప్పించుకునేది. అంతే. మా యిద్దరి మనసులలో ఎలాంటి భావాలూ లేనప్పుడే 'మా యిద్దరికీ ఏదో వుంది' అని యీ వీధిలోవాళ్లు పుట్టించేశారు. ముఖ్యంగా మీ యింటిపక్కనుండే ఆవిడ. ఆవిడకి మరేం పనిలేనట్టుంది. ప్రతి యింటికీ పనిగట్టుకుని వెళ్ళి మా గురించే చెప్తుందట! ఇది తెలిసి మేం యిద్దరం ఎంతో బాధపడ్డాం. ఆ తరువాత విడిగా అనుకోకుండా మానరు కదా అని వాళ్ళమాటే నిజం చేశాం." ఆవేశంగా అన్నారు మాస్టారు.

"మరి పర్సనల్ క్వశ్చన్ అడుగు తున్నందుకు ఏమీ అనుకోకండి.... ఈ మధ్య నేనొకటి విన్నాను. మీరిద్దరూ రాత్రిళ్లుకూడా...."

"ప్రతిరోజూ కాదు. ఆ మధ్య మాస్టారుగారు, భార్యతో కలిసి సెకండ్ షోకి వెళ్లారు అప్పుడు హిమ యిక్కడికొచ్చి చాలా సేపటివరకూ సబ్జక్ట్ చెప్పించుకుంది అంతే."

"మీ యిద్దర్నీ కలపడానికి ఒక విధంగా యీ వీధిలోవాళ్లే కారకులన్న మాట సరే ఉంటాను. మీ యిద్దరి పెళ్ళి త్వరలోనే జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను మరొక్క విషయం. మిగిలిన వాళ్ళలాగా 'ఏవో పరిస్థితులు' అంటూ హిమబిందుకి ఏ రకంగా అన్యాయం జరక్కుండా చూడండి" అన్నాను.

"ఆ ఆత్మవిశ్వాసం, ఆత్మ స్థైర్యం లేకపోతే అసలీ వ్యవహారంలోనే దిగి వుండేవాడిని కాదు" అన్నారు మాస్టారు దృఢంగా.

"వెరీ గుడ్. ఐ విష్ యూ ఆల్ సక్సెస్" అని కిందకుదిగిపోయాను

ఆ రాత్రి మా శ్రీమతికి మా యిద్దరి మధ్య జరిగిన సంభాషణంతా చెప్పాను.

"మన పక్కింటి పిన్నిగారికి విడిగా వున్న ఆ యువతీయువకుల్ని ఒకటిచేసిన పుణ్యం దక్కింది. ఇలా పుకార్లవల్లా, చెవులు కొరుక్కోవడం వల్లాకూడా లాభాలుంటాయన్నమాట" అన్నాడు నవ్వుతూ.

"అసలింతకీ మీరా మేస్టారని నమ్ముతున్నారా" సూటిగా అడిగింది మా శ్రీమతి.

"అవకాశాలు రానంతవరకూ అందరూ ప్రవరాఖ్యులే. ఓ అబ్బాయి ఓ అమ్మాయి కలిసి మాట్లాడితే ఓ సంబంధం అంటగడ్తారు దాంతో తటపటాయిస్తున్న వాళ్ళిద్దరూ తక్కున ఒకటవుతారు. అసలు వాళ్ళ బుర్రల్లోనికి ప్రేమబీజాలు నాటిందీ వాటిని పెంచి పెద్దచేసి ప్రేమ ఫలాన్ని అందించిందీ మన సమాజమే సుమా" అన్నాను నేను నాటకఫక్కీలో.

"ఎందరో మహానుభావులు. అందరికీ వందనాలు" అంటూ పాడుకొంది.

"అందరూ మహానుభావులే! ఎందరికని వందనాలు" అని నేనూ ఆ కీర్తన అందుకుని తక్కున లైటార్పేశాను.

